క్లుప్తంగా

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు తహసీల్దార్ జ్యోతి సోమవారం అందజేశారు. అయిజ మండలంలోని 123 మందికి చెక్కులు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



అయిజ: మండలంలోని దేవబండ గ్రామంలో సోమవారం వేదపండితులు శాస్త్రోక్తంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి 150 ప్లేట్ల వితరణ



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు 150 భోజన ప్లేట్లు అందజేశారు. పాఠశాలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు.. కేసు నమోదు

రాజోళి: తమకు సంబంధించిన భూమిలో హద్దురాళ్లను తొలగించడంతో పాటు, హద్దు దాటి రాళ్లు పాతేందుకు ప్రయత్నించరన్నా ఘటనలో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పవన్‌కుమార్ గౌడ్ మండలంలోని పెద్దధన్వాడలో 197 సర్వే నంబర్‌లో 3 ఎకరాల 9గుంటల భూమి 2024లో కొనుగోలు చేశాడు. కాగా అదే గ్రామానికి చెందిన తెలుగు శ్రీనివాసులు, కర్నూల్‌లో నివాసం ఉంటున్న వినోద్ కుమార్ గౌడ్ ఆ పొలానికి ఉన్న హద్దురాళ్లను తొలగించి వేరే వాళ్ల రాళ్లు పాతినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పవన్‌కుమార్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

హైదరాబాద్ తరలిన ఎస్‌ఏసీ కమిటీ సభ్యులు



గట్టు: జెండర్ రీసోర్స్ సెంటర్‌పై హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న శిక్షణ కార్యక్రమానికి మండలం నుంచి సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు తరలివెళ్లారు. సోమవారం గట్టు నుంచి ప్రత్యేక బస్సులో మొదటి విడతగా 50 మంది ఎస్‌ఏసీ కమిటీ సభ్యులు తరలి రావాలని, రెండో విడత శిక్షణ కార్యక్రమం త్వరలో ఉంటుందని మండల ఇన్‌చార్జి ఏపీఎం జయాకర్ తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ, సీసీలు రామకృష్ణ, జ్యోతి, దేవాదాసు, సుదర్శన్, ఆంజనేయులు, శివకుమార్, ఆయా గ్రామాల సంఘం లీడర్లు పాల్గొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరమశివుడికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నీలకంఠేశ్వరుడికి పూజలు..

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల నీలకంఠేశ్వరస్వామి వారికి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు అడవిస్వామి, మంజునాథస్వామి, మల్లికార్జునస్వామి, శివస్వామిల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు.

అడుగడుగునా.. గుంతలే!

- అధ్వానంగా రాయచూర్ రహదారి
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ధరూరు పెట్రోలు బంక్ వద్ద గుంతలమయంగా రాయచూర్ రోడ్డు

ధరూరు: గద్వాల– రాయచూర్ ప్రధాన రహదారిలో వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని ఎవరి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందోనని జంకుతున్నారు. ధరూరు నుంచి గద్వాల వెళ్లే దారిలో 10 కిమీ మేర అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

వేలాది వాహన రాకపోకలు..

గద్వాల– రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై కర్నాటక నుంచి వ్యాపారస్తులు అధిక సంఖ్యలో గద్వాలకు వచ్చి వెళ్తుంటారు. ముఖ్యంగా జములమ్మ సీజన్ కావడంతో అక్కడి భక్తులు బస్సులు, జీపులు, ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. గతంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణ సమయంలో హైదరాబాద్ నుంచి జడ్చర్ల వయా మహబూబ్‌నగర్, మక్తల్ మీదుగా వెళ్లే బస్సులు, భారీ వాహనాలు ఈ మార్గం ద్వారానే నడిపారు దీంతో రహదారి అధ్వానంగా మారింది.



పారుచర్ల స్టేజీ సమీపంలో ఇలా..

ప్యాచ్ పనులు చేపట్టలేదు..

ధరూరు ఇండియన్ పెట్రోల్ బంక్, హెచ్‌పీ పెట్రోల్ బంకు, బాపనయ్య చేను వద్ద, పారుచర్ల స్టేజీ, గోనుపాడు వెళ్లే దారిలో మూడు చోట్ల, సంగాల స్టేజీ సమీపాల్లో రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అప్పుడప్పుడు గుంతల్లో మట్టిని పోసి కాలం వెళ్ల దీస్తున్నారు తప్పా.. కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేపట్టడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ రామకృష్ణను వివరణ కోరగా.. నందిన్ని నుంచి మూడు ప్యాకేజీల నిర్మాణం పూర్తయ్యింది. ధరూరు నుంచి చేయాల్సి ఉందని సంబంధిత కాంట్రాక్టర్ వేరే పనులు చేస్తుండడంతో ఇక్కడ పనులు నిలిచిపోయాయి. త్వరలోనే ప్యాచ్ వర్క్ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

మరమ్మతు చేయాలి..



గద్వాల– రాయచూర్ రహదారి గుంతలయమంగా మారింది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు ఇది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రమాదకరంగా ఉంది. గుంతలు పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–హనుమంతు, దోర్నాల

పనులు పూర్తి చేయాలి..



రహదారిపై ప్యాచ్ వర్క్ త్వరగా పూర్తి చేయాలి. గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది ప్రయాణికులు వాహనం అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యారు.

–విజయాచార్యులు, ధరూరు

ఉల్లాసంగా బలప్రదర్శన పోటీలు



సందెరాయి ఎత్తుతున్న యువకుడు



స్లోబైక్ రేస్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

శాంతినగర్: మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన బలప్రదర్శన పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ సందర్భంగా సందెరాళ్లు, గుబ్బల గుండు పోటీల్లో స్థానికులతో పాటు కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకులు పాల్గొన్నారు. గుబ్బల గుండు పోటీల్లో మొదటి బహుమతి శివ రూ.5016, రెండో బహుమతి గజ రూ.3016, మూడో బహుమతి రూ.2016 జూలెకల్ గ్రామ కమిటీ సభ్యులు అందజేశారు. అదే విధంగా స్లో బైక్ రేస్‌లో కుమ్మరి వీరేష్ మొదటి బహుమతి రూ.3,016, కుమ్మరి అశోక్ రూ.2,016 గెలుపొందారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం సీనియర్ విభాగం పశువుల బలప్రదర్శన బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రైతులకు బోనస్ చెల్లించాలని వినతి

గద్వాల: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను కొనుగోలు చేసిన ప్రభుత్వం రైతులు ఇస్తామన్న బోనస్ డబ్బులు ఇంతవరకు చెల్లించలేదని బీఆర్ఎస్ నేత కుర్వపల్లయ్య అన్నారు. ఈమేరకు ఆయన రైతులతో కలిసి సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు బోనస్ డబ్బులు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు.

మున్సిపల్ షాపు కేటాయించండి..

గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండులో ఉన్న మున్సిపల్ షాపులకు 2023లో వేసిన వేలం పాటలో తాను షాపు నంబర్ 5ను దక్కించుకున్నానని కానీ నేటివరకు తనకు షాపును కేటాయించలేదని చిన్న లక్ష్మన్న అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు షాపు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ న్యాయం జరగలేదని వినతిలో పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తిరుపతన్న ఆధ్వర్యంలో సోమవారం ఏపీఓ సౌజన్య, టీఏ బుచ్చమ్మ, పంచాయతీ కార్యదర్శులు రజియా బేగం, జ్యోతిని సన్మానం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలి



వాగులో పడేసిన ఈజీఎస్ మొక్కలు

ధరూరు: ఓ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాహకం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుంతుదని అల్వలపాడు గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని అల్వలపాడు గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గోవిందుతో సహా పలువురు గ్రామస్తులు స్థానిక నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు లేకపోగా.. అటు రైతులకు అందించలేదన్నారు. అందుకు సంబంధించిన మొక్కలను గ్రామ శివారులోని వాగులో వృథాగా పడేసి ప్రభుత్వ ధనాన్ని గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వృథా చేస్తున్నారని విమర్శించారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఎర్రవల్లి: మండల పరిధిలోని దువాసిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్థర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాలపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

రాజోళి: యోగి ప్రబోధానంద యోగ పీఠం ఇందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీతపై సోమవారం మండలంలోని చిన్నధన్వాడలో ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ఇంటింటా ప్రచారం చేశారు. ఫాల్గుణ పౌర్ణమి, హోలీ పండుగలపై అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో ఆధ్యాత్మిక రచనలు పఠించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, శివ, జయమ్మ, పద్మమ్మ, అనంతమ్మ, జమ్ములమ్మ, దీపిక తదిదరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే చర్యలు



జూరాల జీరో పాయింట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఐ శ్రీహరి

ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని నర్సన్‌దొడ్డి చౌరస్తా, జూరాల జీరో పాయింట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. సోమవారం మండలంలో ప్రధాన కూడళ్ల వద్ద, గ్రామ శివారు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

గట్టు/ధరూరు/మానవపాడు: గట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షలు నాలుగో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 287 మంది విద్యార్థులకు గాను 281 మంది హాజరైనట్లు చీఫ్ సూరింటెండెంట్ కేహెచ్‌డీ రాజు, డిపార్ట్‌మెంటల్ అధికారి కాశీ విశ్వనాథ్ తెలిపారు.

◆ ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల పరీక్షకు 362 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, డిపార్ట్‌మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు.

◆ మానవపాడు మండలకేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ పరీక్షకు 151 మంది విద్యార్థులకు గాను 150 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు



మల్దకల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో జాబు కార్డు ఉన్న కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. అదే విధంగా ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి

ఉండవెల్లి: పంచాయతీ కార్యదర్శులు ఎల్ఆర్ఎస్‌తో పాటు గ్రామ సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ తిరుపతన్న సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ధరూరు: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోతులగిద్ద గ్రామంలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అపార్ ఐడీలు నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం వండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ భద్రత కల్పిస్తుంది



చెక్కు అందజేస్తున్న హరిబాబు

అయిజ: ఖాతాదారుల కుటుంబాలకు ఎస్‌బీఐ భద్రత కల్పిస్తుందని ఎస్‌బీఐ రీజనల్ చీఫ్ మేనేజర్ హరిబాబు అన్నారు. గత సంవత్సరం డిసెంబర్‌లో అయిజ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ఆర్టీసీ బస్సు ప్రమాదంలో హరిజన కృష్ణ మృతి చెందగా అతని బీమాకు సంబంధించిన రూ.20 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ పనులకు మోక్షం..



మస్తీపురంలో సీసీకి నోచుకోని ప్రధాన రహదారి

అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరకు బీటీ రహదారి పనులు పూర్తయి ఏడాదిన్నర కాలం దాటుతున్నా మస్తీపురం మీదుగా నిర్మించే సీసీ పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ప్రయాణికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మస్తీపురం గ్రామ శివారు నుంచి 500 వందల మీటర్ల మేరకు బీటీకి బదులుగా సీసీ రహదారి నిర్మించాలని ప్రతిపాదనలు ఉండటంతో ఎట్టకేలకు సీసీ రహదారి పనులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం భూమిపూజతో పనులు ప్రారంభించనున్నారు. 500 మీటర్ల సీసీ రహదారి పనులకు రూ.75 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పంట కోతల కాలం పూర్తికావడంతో సీసీ రహదారి పనులను చేపడుతున్నామని వెల్లడించారు. రహదారి పనులు పూర్తి చేసి ప్రయాణికులతో పాటు పర్యాటకుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

మహిళా విద్యా ప్రదాత సావిత్రీబాయి



గద్వాలలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్/అలంపూర్/ఎర్రవల్లి/రాజోళి: విద్యావేత్త, భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం గద్వాల పట్టణంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసాక్, జగదీష్, పులిపాటి వెంకటేష్, భాస్కర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్, రామకృష్ణ, రంజిత్, మహేష్, సురేష్, రాఘవేందర్‌రెడ్డి, ఇమ్మాయేనిల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మీనాక్షి నివాళులర్పించారు.

◆ మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు నరసింహ్మా, బాలరాజు, మద్దిలేటి, గోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ బడుగు బలహీన వర్గాల విద్యను ప్రోత్సహించడం కోసం తమ జీవితాలను సైతం దారపోసిన పూలే దంపతులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, బొజ్జన్న, బుచ్చన్న, గోపాల్, రాముడు, భీమన్న, మధు, జయ్యన్న, రామకృష్ణ, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

◆ సావిత్రీ బాయ్ పూలే సేవలు మరువలేనివని కేవీపీఎస్ నాయకులు అన్నారు. రాజోళిలోని అంబేడ్కర్ చౌక్ దగ్గర ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు తిప్పన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్‌కుమార్, బెంజ్‌మెన్, రవి,మంజునాథ్, క్రాంతి, మహేష్, ఉమాదేవి, భీమేశ్వరి తదిదరులు పాల్గొన్నారు.

◆ అయిజ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల పక్షం కమిటీ నాయకులు సోమవారం రాత్రి సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి, అణగారిన వర్గాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె ఆశయాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, తిరుమలరెడ్డి, అంజి, విజయభాస్కర్ రెడ్డి, పల్లయ్య, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజోళిలో సావిత్రీ బాయి వర్ధంతి కార్యక్రమంలో నాయకులు



ఎర్రవల్లిలో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



అలంపూర్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు